జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గాలి, దుమారంతో కూడిన వర్షం రావడంతో జనజీవనం ఇబ్బందిపడింది. హత్నూరలో పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధంకాగా, మరో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు అవస్థలు పడ్డారు. ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరో ఐదు రోజుల పాటు వర్షం ఉందని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 16

సంగారెడ్డి కలెక్టరేట్: హత్నూర మండలం గుండ్లమాచునూర్‌లో తడిసిన వరి ధాన్యం కుప్పలు

సంగారెడ్డి కలెక్టరేట్: వాననీటికి కొట్టుకొచ్చిన ధాన్యం

చినుకు.. వణుకు

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ▪ పలు చోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అన్నదాత కుదేలు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 16: అకాల వర్షం మరోసారి అన్నదాతను కుదేలు చేసింది. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. సంగారెడ్డి, జిన్నారం, హత్నూర, కంది తదితర మండలాల్లో భారీ వర్షం కురవగా, కొన్ని మండలాల్లో ఓ మోస్తారు వర్షం నమోదైంది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో వాతావరణ చల్లబడింది. ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కాస్తా ఉపశమనం లభించినప్పటికీ అన్నదాతలకు మాత్రం నష్టాన్ని మిగిల్చింది. ఇప్పటికే వరిధాన్యం కొనుగోళ్లు పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఇంకా ఎక్కడి కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో వరి కోతలు పూర్తై 15 రోజులు గడుస్తున్నా ధాన్యం కుప్పలు మాత్రం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి. మరికొన్ని కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతున్నది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల నుంచి కుప్పలుగా ఉంచడం ద్వారా తేమ శాతం పూర్తిగా తగ్గిపోతున్నదని, చేసిన కష్టానికి ఫలితం లేకుండా పోతుందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ధాన్యం సేకరణ పూర్తి చేసి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాటిపత్రిలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి.

లింగాపూర్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధం

హత్నూర, మే 16: హత్నూర మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. మండలంలోని పలుగ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసిముద్దయ్యాయి. సాదుల్లానగర్‌లో పిడుగుపడటంతో గ్రామానికి చెందిన పుట్లగారి లింగయ్యకు చెందిన 150 గడ్డిమోపులు కాలిపోయాయి. గ్రామ సమీపంలో పిడుగుపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో ఈదురుగాలులకు ఏడు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతోపాటు చందాపూర్ శివారులో మూడు స్తంభాలు నేలకొరిగాయి.

సాదుల్లానగర్‌లో పిడుగుపడటంతో కాలిపోయిన గడ్డిమోపులు

సంగారెడ్డిలో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం

సంగారెడ్డిలో గొడుగు కింద వెళ్తున్న యువతులు

సంగారెడ్డి, మే 16: వేసవిలో ఉక్కపోత, ఎండతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు గురువారం మధ్యాహ్నం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షానికి పట్టణవాసులు తడిసి ముద్దయ్యారు. ఉక్కపోత చిరుజల్లులకు తడిసిన జనాలు, గొడుగులు పట్టుకుని తమకు కావాల్సిన వస్తువులు కొనుగోళ్లకు పయనమయ్యారు. వాహనాలు హెడ్ లైట్లు వేసుకొని రోడ్లపై వెళ్తూ కనిపించాయి. ద్విచక్ర వాహనదారులు సైతం గొడుగులు పట్టుకుని ప్రయాణం సాగిస్తూ కనిపించారు. అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలకు చిరుజల్లులు పడడంతో కొంత వరకు ఉపశమనం పొందారు.

సంగారెడ్డి: వర్షం దాటికి వెలుతురు లేకపోవడంతో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

కోహీర్‌లో మోస్తరు వర్షం

కోహీర్, మే 16: మండల కేంద్రమైన కోహీర్‌తోపాటు బిలాల్‌పూర్, మనియార్ పల్లి, బడంపేట, గొటిగార్‌పల్లి, పర్శపల్లి, తదితర గ్రామాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. వాన కురువడంతోపాటు వడగండ్లు పడడంతో మామిడికాయలు నేలరాలి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కోహీర్: బిలాల్‌పూర్‌లో కురుస్తున్న వర్షం

అన్నదాత ఆగమాగం

జిన్నారం: కొనుగోలు కేంద్రంలో వడ్ల కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

జిన్నారం, మే 16: అన్నదాతను అకాల వర్షాలు ఆగమాగం చేస్తున్నాయి. వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి జరిగిన నష్టం నుంచి తేరుకోక ముందే అప్పుడప్పుడు వస్తున్న చిన్నపాటి వర్షాలు రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షానికి రైతులు అవస్థలు పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎండబోసిన ధాన్యం తడవకుండా పట్టాల కోసం పరుగులు తీశారు. దొరికిన సంచులను వడ్లపై కప్పి జాగ్రత్తపడ్డారు. రోడ్లపై ఆరబోసిన వడ్లు తడిచిపోయాయి. ఆరబోసిన వడ్లు తడవడంతో మళ్లీ వాటిని ఆరబోయాల్సిందేనని రైతులు వాపోయారు.

పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్‌చెరు, మే 16: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం పటాన్‌చెరు మండలం కర్దనూర్, ఘనపూర్, రుద్రారం ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని వంట గదులు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్‌బోర్డు, మేజర్, మైనర్ మరమ్మతులు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడొద్దని, పనులను నాణ్యతతో చేయించుకోవాల్సిన బాధ్యత విద్యా శాఖ అధికారులదే అన్నారు. పాఠశాలల్లో మంచి బ్రాండ్ ఉన్న కంపెనీల నాలుగు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు పెట్టాలని సూచించారు. పాఠశాలల్లో మిషన్ భగీరథ ద్వారా పిల్లలకు తాగునీరు అందేలా చూడాలన్నారు. అన్ని పాఠశాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటిని రిపేర్ చేయించుకోవాలని సూచించారు. ప్రహరీ పైనుంచి ఎవరూ దూకి రాకుండా కంచెలను అమర్చాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, చదువుతో పాటు పిల్లలకు ఆటపాటల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, పీఆర్ ఈఈ సురేశ్, తహసీల్దార్ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రమాదవశాత్తు రెయిలింగ్ కూలి వ్యక్తి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- పూర్తిగా ధ్వంసమైన రేకుల ఇల్లు

జయదేవ్ (ఫైల్)

బొల్లారం, మే 16: ప్రమాదవశాత్తు ఓ మూడు అంతస్తుల భవనం రెయిలింగ్ కూలడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పారిశ్రామికవాడలోని లక్ష్మీనగర్‌లోని ఓ మూడంతస్తుల భవనం రెయిలింగ్ గోడకు ఆనుకుని దీపాకర్ అనే వ్యక్తి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిట్టగోడ కూలడంతో పక్కనే ఉన్న రేకుల ఇళ్లపై పడిపోయాడు. రేకుల ఇంట్లో నిద్రిస్తున్న దంపతుల్లో భర్త జయదేవ్(50)పై కూలిన గోడ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సుజాత, కొడుకు రాకేశ్ ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. మరో వ్యక్తి ధన్ పరాన్కర్(29) కుడికాలు విరిగిపోయింది. స్థానికులు వెంటనే సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఆనంద్ కృష్ణారెడ్డి గాయపడ్డ వారిని తన సొంత వాహనంలో సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి వైద్యం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ భవనాన్ని, కూలిన గోడను పరిశీలించి రిపోర్టును మున్సిపల్ కమిషనర్ మంగతాయారుకు అందజేశారు.

పండ్ల వ్యాపారిపై కత్తితో దాడి

ఐదుగురిపై కేసు నమోదు

కంది, మే 16: మామిడి పండ్ల వ్యాపారిపై కత్తితో దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బోరబండకు చెందిన మహ్మద్ ఖలీల్ కంది మండలం బేగంపేట శివారులోని మామిమితోటను లీజ్‌కు తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. బేగంపేట్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు మామిడిపండ్లు కొనుగోలు చేసేందుకు ఈ నెల 15న సాయంత్రం తోటకు వెళ్లారు. కొనుగోలు విషయంలో వ్యాపారితో వాగ్వాదం చోటుచేసుకోవడంతో వ్యాపారి ఖలీల్ తమ్ముడు యూసూఫ్‌పై కత్తితో దాడి చేశారు. దాడిలో యూసూఫ్ చెంపకు గాయమైంది. ఇందుకు కారణమైన బేగంపేట్‌కు చెందిన ప్రవీణ్, అనిల్‌గౌడ్, మనోజ్, రాజు, సాయికిరణ్‌గౌడ్‌లపై గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కందిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కలెక్టర్ వల్లూరి క్రాంతి

కంది, మే 16: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కందిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు గన్ని భ్యాగులు ఇచ్చారా లేదా అనే దానిపై ఆరా తీశారు. ఆకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సేకరించిన ధాన్యమేంత, మిల్లులకు తరలించిన ధాన్యమేంత అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధవి, వ్యవసాయ శాఖ అధికారులు, కంది పీఎసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యభిచార నిర్వాహకుడికి మూడేండ్ల జైలు

అమీన్‌పూర్, మే 16: వ్యభిచార గృహాన్ని నడుపుతున్న వ్యక్తికి కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడలో నగరంలోని నేరేడుమెట్టుకు చెందిన కృష్ణ శిల్(40) ఓ ఇల్లు అద్దెకు తీసుకొని బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువతులతో వ్యభిచారం నడిపేవాడు. నిందితుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సదరు మహిళలు పోలీసు అధికారితో వివరించారు. సదరు యువతుల ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సమగ్ర దర్యాప్తు అనంతరం నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను విన్న న్యాయస్థానం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయమూర్తి రాధాకృష్ణ చాహవాన్ నిందితుడికి మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఒకవేళ జరిమానా చెల్లించడంలో విఫలమైతే మూడు నెలల జైలు శిక్ష అదనంగా విధించడం జరుగుతుందని జడ్జి తీర్పు వెలువరించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ప్రతిభ

అమీన్‌పూర్, మే 16: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడకు చెందిన అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. పాఠశాలకు చెందిన విశ్వతేజ 474 మార్కులు, లాస్య 471 మార్కులు, సాయి శివాని 470 మార్కులు, సాత్వికాడ 470 మార్కులు, శ్రీనిధి 468 మార్కులు, చైత్ర సింధుజ 465 మార్కులు, హేమా కేష్‌రెడ్డి 455 మార్కులు, లక్ష్మీప్రసన్న 453 మార్కులు, శాన్వి 453 మార్కులు, సాయి శ్రేయస్ 453 మార్కులు, మహాశ్వి 450 మార్కులు, సాయి ఆకాంక్ష 450 మార్కులతో 12 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. 13 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులు సాధించారు. 19 మంది 70 శాతానికిపైగా మార్కులు సాధించారు. మంచి ప్రతిభతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్లు శ్రీనివాసరావు, శిరీష ప్రత్యేకంగా అభినందించారు.

అమెరికాలో జహీరాబాద్ వాసి మృతి

రోడ్డు ప్రమాదంలో మృత్యువాత

కోహీర్, మే 16: మండలంలోని మనియార్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే చెల్లెలి కుమారుడు అబ్బరాజు పృథ్వీరాజ్(30) అమెరికాలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన మధురావెంకటరమణల కుమారుడు అబ్బరాజు పృథ్వీరాజ్ ఎనిమిదేండ్ల క్రితం ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్లాడు. ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం చోర్లెట్ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే తుదిశ్వాస విడిచాడు. ఇటీవల శ్రీప్రియతో పృథ్వీరాజ్‌కు వివాహం జరిగింది. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో దహన సంస్కారాలు నిర్వహించే అవకాశం ఉంది. అతడి మృతదేహం కోసం శోకతప్త హృదయాలతో ఎదురుచూస్తున్నారు.

అబ్బరాజు పృథ్వీరాజ్(ఫైల్)

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కంది, మే 16: ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్డీవో బాల్‌రాజు ఫీల్డ్ ఆఫీసర్స్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గురువారం కంది మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింది చేపట్టిన పనులు, ఖర్చులపై మూడో విడత సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. కొన్ని పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద నాటిన మొక్కలు ఎక్కువ మొత్తంలో ఎండిపోవడం, కూలీల హాజరు రిజిస్ట్రార్ సక్రమంగా లేకపోవడం, గైర్హాజరైన కూలీలకు డబ్బులు చెల్లించడం, గ్రామ సభలు నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నాలుగో శనివారం రోజ్‌గార్ నివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవీఓ నాగేశ్వర్‌రావు, ఎస్ఆర్పీ బాలునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోరంచ జాతరకు పోటెత్తిన భక్తజనం

అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు

మనూర్, మే 16: నల్లపోచమ్మ ఆలయ జాతర ఘనంగా ప్రారంభమైంది. మనూర్ మండల పరిధిలోని బోరంచ నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు గురువారం ప్రారంభం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొదటి రోజు జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పుజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలు ఏడు వారాల పాటు కొనసాగనున్నాయి. ప్రతి గు రు, ఆది వారాల్లో ఆలయానికి భక్తుల తాకిడీ ఎక్కువగా ఉంటుంది.

భయం.. భయం

పొంచి ఉన్న ప్రమాదం.. శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

ఎప్పుడు కుప్ప కూలుతుందో తెలియని పరిస్థితి

హత్నూర, మే 16: మండల కేంద్రమైన హత్నూరలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వాటర్‌ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పెచ్చులూడి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం వాటర్‌ట్యాంకులో నీటిని నింపుతూ ప్రజలకు సరఫరా చేస్తున్నప్పటికీ వాటర్‌ట్యాంకు లోపలి భాగం శుభ్రం చేయడం కోసం దానిపైకి వెళ్లలేని స్థితికి చేరుకున్నది. చేసేదేమిలేక శుభ్రం చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ జనాభా ఎక్కువ ఉండటంతో ఉన్న వాటర్‌ట్యాంకును తొలిగిస్తే ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున శిథిలావస్థకు చేరుకున్న వాటర్‌ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. నిత్యం వాటర్‌ట్యాంకు సమీపంలో నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం కుప్ప కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. అధికారులు స్పందించి కొత్త వాటర్‌ట్యాంకు నిర్మాణం చేపట్టి శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకును తొలిగించాలని కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న పిల్లర్లు

హత్నూరలో శిథిలావస్థకు చేరుకున్న వాటర్‌ట్యాంకు